క్లుప్తంగా

87 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: మునగపాడు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 87 మందికి రక్త, మూత్ర పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యానీగ్రేస్ ఆరోగ్య జాగ్రత్తలను రోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ కె.సుదర్శన్‌రాజు, ఎంఎల్‌హెచ్‌పీ లింగరాజు, ఏఎన్ఎం పాపులమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శారీరక శుభ్రతతోనే ఆరోగ్యం



ఫిరంగిపురం: శారీరక శుభ్రతతోనే మహిళలకు ఆరోగ్యం చేకూరుతుందని డాక్టర్ ఫరీనా బేగం అన్నారు. మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రుతుక్రమం ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫరీనా బేగం మహిళలకు రుతుక్రమం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. చేతులు శుభ్రంగా ఉంచుకోకోవాలని, మంచినీటి స్నానం చేయాలని చెప్పారు. ప్రతి నెలా రుతుక్రమం సక్రమంగా వస్తున్నదీ లేనిది గమనించాలని, లేకుంటే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటలక్ష్మి, పీహెచ్ఎన్ గాయత్రీదేవి, ఎంపీహెచ్ఎస్ అబ్దుల్ రెహమాన్, హెచ్‌వీ నూర్ ఖాజాబీ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈఈ ఎస్.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శృంగారపురం, తుమ్మపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని పేర్కొన్నారు.

నవులూరులో..

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధి నవులూరులోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టరోడ్డు, ఉడా కాలనీ, శిబిరం, బాపూజీ నగర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

31న తాడికొండ సర్వసభ్య సమావేశం

తాడికొండ: ఈ నెల 31న తాడికొండ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ తాళ్ళ భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండలస్థాయి అధికారులు తమ శాఖల పరిధిలోని అభివృద్ధి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

1న హనుమజ్జయంతి వేడుకలు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొత్తూరు తాడేపల్లి, మారుతీ నగర్ శ్రీ దాసాంజనేయస్వామి దేవస్థానంలో జూన్ 1న హనుమజ్జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటలో తెలియజేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా మే 30 గురువారం ఉదయం 7.30 గంటలకు మూల విరాట్‌కు పంచామృత అభిషేకం, శుక్రవారం ఉదయం మన్యుసూక్త సహిత హనుమత్ హోమం, సాయంత్రం 6 గంటల నుంచి సువర్చల సహిత దాసాంజనేయస్వామి కల్యాణ మహోత్సవం 1న దాసాంజనేయస్వామికి ఉదయం తమలపాకుల పూజ, సిందూరార్చన, విశేష అర్చనలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన, సాయంత్రం 6 గంటలకు స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నామని తెలిపారు. భక్తులు హనుమజ్జయంతి ఉత్సవాల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

మంగళగిరి: పట్టణంలోని భార్గవ పేటలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భార్గవపేటకు చైతన్య అనే యువకుడు రోజు లాగే తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి మంగళవారం ఉదయం లేచి చూడగా కనిపించ లేదు. చోరీకి గురయిందని గ్రహించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

22 రౌండ్లలో మంగళగిరి ఫలితం

- అత్యధికంగా 40 మంది అభ్యర్థులు పోటీ
- రాత్రి వరకు కొనసాగనున్న లెక్కింపు
- ఏజెంట్ల ప్రక్రియ పూర్తి చేసిన రాజకీయ పార్టీలు
- ఏఎన్‌యూలో 4న కౌంటింగ్



కౌంటింగ్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచనలు ఇస్తున్న జేసీ రాజకుమారి

మంగళగిరి: సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం మంగళవారం తేలనుంది. జూన్ నెల 4న ఓట్ల లెక్కింపు జరుగనున్న నేపథ్యంలో పోటీ చేసిన అభ్యర్థులతో ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. ఓట్ల లెక్కింపులో ఎలాంటి తప్పిదాలు జరక్కుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జేజీ రాజకుమారి ఘనియా ఇప్పటికే పలు మార్లు ఓట్ల లెక్కింపులో పాల్గొనే అధికారులకు శిక్షణనిచ్చి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కౌంటింగ్ ప్రక్రియకు ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు తమ ఏజంట్లు ఏర్పాటు చేసుకుని, కౌంటింగ్‌లో అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. కౌంటింగ్ రోజు ఎలాంటి ఘటనలు జరక్కుండా పోలీసులు పటిష్ట బందోబస్తుకు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,92,432 మంది ఓటర్లుండగా అందులో పురుషులు 1,40,600 మంది మహిళలు 1,51,769 మంది, ఇతరులు 13 మంది ఉన్నారు. 2,52,742 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో పురుషులు 1,21,039 మంది, మహిళలు 1,29,697 మంది ఇతరులు ఏడుగురు ఉన్నారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో భద్రపరిచారు.



హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు

14 టేబుళ్లు..22 రౌండ్లు

కౌంటింగ్‌కు ఏఎన్‌యూలో 14 టేబుళ్లను ఏర్పాటు చేసి 22 రౌండ్లు లెక్కించేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి టేబుల్‌కు సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్‌లు, మైక్రో అబ్జర్వర్‌లను నియమించారు. అభ్యర్థులు అధికంగా ఉండడంతో పోలింగ్ అధిక శాతం నమోదు కావడంతో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి కావడానికి రాత్రి వరకు పట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓట్లు లెక్కించనున్నారు. పోలింగ్ బూత్‌లకు రాలేక ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకున్నారు. 441 మంది ఓటర్లుండగా పోస్టల్ బ్యాలెట్‌ను 3,191 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సజావుగా ప్రశాంతంగా జరిగేలా అభ్యర్థులు, ఏజంట్లు, అధికారులు సహకరించాలని కోరారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జేసీ రాజకుమారి ఘనియా కోరారు. జూన్ 4న ఉదయం 7 నుంచి అభ్యర్థులు ఏజెంట్లు, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను తెరచి ఈవీఎంలను కౌంటింగ్ రూమ్‌లకు తరలించడం జరుగుతుందన్నారు. అనంతరం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు.

పశువుల పాకలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఫిరంగిపురం: వేసవిలో పశువుల పాకలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నుదురుపాడు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో వడదెబ్బ తగిలిన పశువులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎండకు పశువులను మేతకు బయటకు పంపకూడదని చెప్పారు. తీవ్రమైన అనారోగ్యం కలిగినప్పుడు పశువులు మేత మేయకుండా పడుకుంటాయని చెప్పారు. అప్పుడు వైద్యుడిని సంప్రదించి, మందులు వాడుకోవాలని సూచించారు. చల్లటి తాగునీరు అందుబాటులో ఉంచి శుభ్రమైన వరిగడ్డి, జనుము వంటి మేతను వేసుకోవాలన్నారు. ఈ సమయంలో ఎక్కువగా గొంతువాపు వ్యాధి వస్తుందని, వ్యాక్సిన్ వేయించాలని చెప్పారు.



వడదెబ్బ తగిలిన పశువులను పరీక్షిస్తున్న పశువైద్యాధికారి పీర్ అహ్మద్

పవర్ లిఫ్టర్‌కు ఫీజు రాయితీ

తాడేపల్లి రూరల్ : పవర్ లిఫ్టింగ్‌లో వరుసగా నాలుగు బంగారు పతకాలు సాధించిన విద్యార్థినికి వందశాతం ఫీజు రాయితీ ఇస్తున్నట్లు కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ తెలిపారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు హాంకాంగ్‌లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ జూనియర్ విభాగంలో (84 కేజీలు) కేఎల్‌యూ విద్యార్థిని షేక్ షబీనా స్కాట్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ విభాగాలతో పాటు మొత్తం నాలుగు బంగారు పతకాలు సాధించి, రికార్డు సృష్టించిందని తెలిపారు. సబీనా బీబీఏ మొదటి సంవత్సరం చదువుతోందని చెప్పారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరి కిషోర్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.



షేక్ షబీనాను అభినందిస్తున్న వీసీ డాక్టర్ పార్థసారథివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు

గడువు దాటితే.. గడప దాటించండి

- గడువు ముగిసిన సిలిండర్లతో ప్రమాదం
- అప్రమత్తతతో ప్రమాదాలు దూరం
- జాగ్రత్తలతో గృహిణులకు లాభం

తాడేపల్లి రూరల్ : ప్రతి వస్తువుకూ గడువు ఉంటుంది. వీటిలో కాలం చెల్లిన ఈ గ్యాస్ సిలిండర్ వినియోగించడం అత్యంత ప్రమాదకరం. వినియోగదారులు దీనిపై అవగాహన పెంచుకుంటే ప్రమాదం బారినపడకుండా ఉండొచ్చు. గ్యాస్ సిలిండర్ నెలల తరబడి వాడకుండా నిల్వ ఉంచుతారు. మరి కొంతమంది బ్లాక్‌లో కొని వాడుతుంటారు. అయితే సిలిండర్‌పై గుర్తించిన గడువు తేదీ లోపు వాడితే ఉత్తమం. కాలం చెల్లిన సిలిండర్లను సంబంధిత డీలర్‌కు తిరిగి ఇచ్చేయాలి.

ముగింపు తేదీని గుర్తించండి ఇలా..

నేడు ప్రతి వంటింటిలో గ్యాస్ సిలిండర్ తప్పనిసరి. ఈ గ్యాస్ సిలిండర్ గడువు తేదీ రింగ్‌కు కింద భాగంలో ముద్రించి ఉంటుంది. ఏడాదిలోని 12 నెలలను నాలుగు భాగాలుగా విభజించి ఆంగ్ల భాషలోని ఏబీసీడీ అక్షరాలను రాస్తారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు-ఎ, ఏప్రిల్, మే, జూన్ నెలలకు-బీ, జూలై, ఆగష్టు, సెప్టెంబరు- సీ, అక్టోబర్, నవంబర్, డిసెంబరు-డీ అని రాస్తారు. ఉదాహరణకు సిలిండర్‌పై డీ-24 అని రాసి ఉంటే అది 2024 డిసెంబరు వరకే వినియోగించాలని అర్థం. ఆ నెల దాటితే సిలిండర్ కాలం చెల్లిందని తెలుసుకుని దూరంగా పెట్టాలి. ఖాళీ సిలిండర్లకు నిర్దిష్ట కాల పరిమితి ఉంటుంది. ఇది వినియోగదారులకు సంబంధం లేదు. తయారీదారులు తమ వద్ద రికార్డుల్లో లేని బ్యాచ్ నంబర్ల ప్రకారం ఏడేళ్లు దాటిన వాటిని వెనక్కు తెప్పించుకుని పరీక్షించి, నాణ్యత లేని వాటిని పక్కన పెట్టేస్తారు.



సిలిండర్‌పై ఉన్న గడువు తేదీని గుర్తించాల్సిన చోటు..

మధ్యాహ్న భోజన తయారీపై శిక్షణ

మేడికొండూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన సిబ్బందికి శిక్షణ కార్యక్రమం పలు పాఠశాలల్లో మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్వీన్ విచ్చేసి మధ్యాహ్న భోజనం తయారు చేసే నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం పలు రకాల వంట పోటీలు నిర్వహించారు. పోటీల్లో కిరణ్‌కుమార్, కరీముల్లా, శ్రావణి, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, వంటలు పరిశీలించి సూచనలు చేశారు. పోటీల్లో విజేతలకు సిరిపురం, కొర్రపాడు, మేడికొండూరు పాఠశాలలకు చెందిన మహిళలకు మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ అలీం అభినందించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, సుభాని పాల్గొన్నారు.

వయోజనులకు బీసీజీ టీకాలను వేయండి

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: వయోజనులందరికి బీసీజీ టీకాలు వేయాలని తెనాలి డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఇ.అన్నపూర్ణ ఆదేశించారు. తెనాలి పరిధిలోని మెడికల్ ఆఫీసర్లతో టీబీ యూనిట్‌లో మంగళవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయస్సు దాటిన ప్రతి ఒక్కరూ బీసీజీ టీకా వేయించుకునేందుకు అర్హులన్నారు. ప్రభుత్వం మొదటి విడత కింద వృద్ధులకు వేయడం జరుగుతుందన్నారు. రెండో విడత అందరికి టీకాను వేయనున్నట్లు చెప్పారు. టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ కలగొట్ల రాధిక మాట్లాడుతూ అర్హులు తమ పేర్లను సచివాలయంలో నమోదు చేయించుకోవాలని చెప్పారు. క్రమపద్ధతిలో అందరికి టీకాలు వేయడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో తెనాలి పరిధిలోని మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ

పార్కుల మరమ్మతులు వెంటనే చేపట్టండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: మున్సిపల్ పార్కుల్లో అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. 8వ వార్డులోని గాంధీ పార్కును మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడ చేపట్టాల్సిన మరమ్మతులపై డీఈ నాగభూషణం నుంచి వివరాలు సేకరించారు. అనంతరం 10వ వార్డులో పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మంచి నీటి సరఫరా సక్రమంగా చేయాలన్నారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని చెప్పారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాజీ, రామచంద్రరావు, హర్టి కల్చర్ ఆఫీసర్ శేషుబాబు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



స్ప్రేయింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

నేడు జాబ్ మేళా

తెనాలి అర్బన్: ఇంటర్మీడియెట్ బోర్డు, ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్‌సీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10గంటలకు రైల్వేస్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు హెచ్‌సీఎల్ కంపెనీ కో-ఆర్డినేటర్ పి.గురునాథ్ పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్‌లో 75శాతం మార్కులు దాటిన బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ విద్యార్థులు, ఒకేషనల్ కోర్సు పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. మూడంచెల విధానంలో ఎంపిక ఉంటుందని, ఎంపికైన వారికి ఒక సంవత్సరం పాటు ట్రైనింగ్ ఇచ్చి అనంతరం హెచ్‌సీఎల్ ఉద్యోగిగా నియమించడం జరుగుతుందన్నారు. ట్రైనింగ్ సమయంలో నెలకు రూ.10 వేలు, ఉద్యోగంలో చేరిన నాటికి నుంచి నెలకు రూ.14,500 ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రముఖ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ కూడా చదివేందుకు సంస్థ ఆర్థిక సాయం చేస్తుందని చెప్పారు. వివరాలకు గురునాథ్ మొబైల్ నంబరు 77807 54278కు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైష్ణవి జూనియర్ కళాశాల డైరెక్టర్ పాటిబండ్ల శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



గరం..గరం గరళం

- హోటళ్ల వైపు కన్నెత్తి చూడని ఫుడ్ సేఫ్టీ అధికారులు
- అపరిశుభ్రత..కల్తీ ఆహార పదార్థాల విక్రయం
- మంగళగిరి ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేసిన వైనం



ఆటో నగర్‌లోని ఓ హోటల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

మంగళగిరి: గరం.. గరంగా.. ఉందని ఆవిరులూదుకుంటూ హోటల్ ఆహారం తింటే.. అది జీర్ణాశయంలోకి వెళ్లి గరళంగా మారుతుంది. హోటళ్లు, టిఫిన్, బిర్యానీ సెంటర్లు, మిఠాయి దుకాణాల్లో ఆహార తయారీని పరిశీలిస్తే మేడిపండు చందం బయట పడుతుంది. బూజు పట్టిన కల్తీ చికెన్, చేపలపై వాసన రాకుండా చల్లిన కెమికల్స్, ఫంగస్ వచ్చిన రోటీలు, కోడిగుడ్లు, ఫ్రిడ్జ్‌లో దాచిన లస్సీలు, ఆరోగ్యం తా అనిపించే మిఠాయిలు దర్శనమిస్తాయి. వీటిని కంట్రోల్ చేయాలంటే ఫుడ్ సేఫ్టీ అధికారులు తరుచూ తనిఖీలు చేయాలి. కానీ, ఆ అధికారులు మన మంగళగిరిలో ఆఖరిగా తనిఖీలు చేసి ఏన్నేళ్లవుతోందా తెలుసా.. దాదాపు నాలుగేళ్లవుతోంది.

2020లో అదే చివరి..

కల్తీ ఆహారంపై 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో 2020లో ఆహార కల్తీ నియంత్రణ అధికారులు ఆఘమేఘాల మీద మంగళగిరి పరిధిలో తనిఖీలు చేపట్టారు. హోటళ్లు, టిఫిన్, బిర్యానీ సెంటర్లపై దాడులు చేశారు. ఈ దాడుల్లో ఆహారం కల్తీ అయిందని నిర్ధారించడంతో పాటు అపరిశుభ్రతను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేశారు. తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి, మమ అనిపించారు.

రిపోర్టులెక్కడా...

దాడుల సమయంలో ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి, ల్యాబ్‌కు పంపామని చెప్పిన అధికారులు ఆ రిపోర్టుల వివరాలు వెల్లడించకపోగా కల్తీ జరిగిన హోటళ్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రజల్లో అధికారులపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి నెలా మామూళ్ల సమయం ఒకటి రెండు తేదీలు మినహా.. నెలంతా వారికి విధులు గుర్తుండవని స్థానిక అధికారులు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థవైపు ఆహార కల్తీ నియంత్రణ అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడం విశేషం.

ప్రతి నెలా మూమాళ్లు వెళ్లాల్సిందే..?

అయితే ప్రతి నెలా ఒక అసోషియేషన్ ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ అధికారులకు లంచాలు వెళ్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. హోటళ్ళు, టిఫిన్ సెంటర్లు, మిఠాయి దుకాణాల నుంచి ఒక్కో దుకాణానికి రూ.10 వేలు వసూలు చేస్తుండడం విశేషం. అధికారులు, అసోషియేషన్ ఒక్కటై ప్రజలకు కల్తీ ఆహారాన్ని అంటగడుతూ వారి జీవితాలతో ఆటలాడుతున్నారని విమర్శలు ఎదురవుతున్నాయి.

గత తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు

గతంలో హోటళ్లను అధికారులు తనిఖీ నిర్వహించిన క్రమంలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా పట్టణంలోని హోటళ్లు, మిఠాయి దుకాణాల్లోని అపరిశుభ్రత చూసిన అధికారులు అవాక్కయి రెండు రోజులలో పద్ధతి మార్చుకోకుంటే మూసేయిస్తామని యజమానులను హెచ్చరించారు. కానీ, హోటళ్లు, మిఠాయి దుకాణాల యజమానులు తమ తీరు మార్చుకోకుండా ఆదే రీతిన కొనసాగిస్తున్నారు. అధికారుల తనిఖీలలో వెలుగులోకి వచ్చిన వాస్తవాలతో వారే కంగుతినడం విశేషం. హోటల్‌లో బూజు పట్టిన కల్తీ చికెన్, చేపలపై వాసన రాకుండా ఏర్పాటు చేసిన రంగులు, కెమికల్స్‌ను స్వాధీనం చేసుకుని వాటిపై ఫినాయిల్ చల్లి ధ్వంసం చేశారు. మరీ ముఖ్యంగా యర్రబాలెం డాన్‌బాస్కో స్కూలు వద్ద డాబా హోటల్‌లో ఫంగస్ వచ్చిన రోటీలు, కోడిగుడ్లు, ఫ్రిడ్జ్‌లో దాచిన లస్సీలు పారవేయించి భూమిలో పూడ్చిపెట్టిన ఘటనలున్నాయి. అనంతరం అధికారులు హోటళ్లు, మిఠాయి దుకాణాల వైపు కన్నెత్తి చూడలేదు.

సిబ్బంది కొరత అంటూ..

ఆహార కల్తీ నియంత్రణ అధికారులు సిబ్బంది కొరత పేరుతో నెలకోసారి వచ్చి నిర్వాహకుల వద్ద మామూళ్లు తీసుకుని వెళ్తారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు తనిఖీలు చేపట్టి కల్తీని నివారించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు. కొద్ది రోజులుగా హైదరాబాద్ ఆహార కల్తీ నియంత్రణ అధికారులు అనేక హోటళ్లను తనిఖీలు నిర్వహించగా విస్తుపోయే వాస్తవాలు బయటపడడం స్థానికులను ఆందోళనకు గురిచేసింది.

తనిఖీలు చేస్తున్నాం..

కల్తీ ఆహారంపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాం. జనవరి నుంచి కొన్ని హోటళ్లలో తనిఖీలు నిర్వహించి, రెండు హోటళ్లపై కేసులు నమోదు చేశాం. టిఫిన్ బండి సెంటర్లు పరిశుభ్రత పాటించకపోయినా, ఆహారం కల్తీ జరిగినా కేసులు నమోదు చేస్తాం. ఆయా హోటళ్లను సీజ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. నిరంతరం తనిఖీలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకుంటాం.

– రవీంద్రరెడ్డి, ఆహార కల్తీ నియంత్రణ అధికారి, ఎంటీఎంసీ.

సీనియర్ పాత్రికేయుడు ఆర్ఎన్ గోపాలకృష్ణ మృతి

తెనాలి: ఆర్ఎన్ గోపాలకృష్ణగా చిరపరిచితులైన, పట్టణంలోని సీనియర్ పాత్రికేయుడు, అర్చక సంఘ రాష్ట్ర నేత రొంపిచర్ల నాగ గోపాలకృష్ణమాచార్యులు (75) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. అనారోగ్యానికి లోనైన ఆయన తిరుపతిలో కుమార్తె ఇంట్లో ఉంటూ అక్కడే చికిత్స తీసుకుంటున్నారు. ఆయనకు భార్య, అయిదుగురు కుమార్తెలు, మనుమ సంతానం ఉన్నారు. భాషా ప్రవీణ చదివిన గోపాలకృష్ణ ముందుగా పాత్రికేయ రంగంలోకి వెళ్లారు. రేపల్లె, తెనాలిలో ప్రముఖ పత్రికలకు విలేకరిగా దాదాపు పదేళ్లకు పైగా పనిచేశారు. విజయవాడ నుంచి వెలువడిన ఇంగ్లిష్ దినపత్రిక ప్లెడ్జికు కొంతకాలం విలేకరిగా ఉన్నారు. జర్నలిస్టు, సినీ నటుడు ఏవీఎస్‌తో కొంతకాలం కలిసి పనిచేశారు. ఏవీఎస్‌తో కలిసి రసమయి సాంస్కృతిక సంస్థను ఏర్పాటుచేసి స్థానిక రాజకీయ నేత డాక్టర్ రావి రవీంద్రనాథ్‌తో కలిసి పలు కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్ర అర్చక సంఘంలోనూ క్రియాశీలంగా ఉన్నారు. తెనాలి రామలింగేశ్వరపేటలోని ప్రాథమిక పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా చేరారు. గోపాలకృష్ణ భౌతిక కాయాన్ని పెనుగుదురుపాడు తరలించనున్నారు. బుధవారం ఆ గ్రామంలోనే అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలియజేశారు.

వైభవంగా పద్మావతి అమ్మవారి కల్యాణం

తెనాలిరూరల్: మండలంలోని ప్రగడ కోటయ్య నగర్‌లో జరుగుతున్న అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం అభిషేకం నిర్వహించారు. అనంతరం 11 గంటలకు పద్మావతి అమ్మవారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు కటకం రాంబాబు, అన్నపూర్ణ దంపతులు కళ్యాణోత్సవంలో పాల్గొనగా.. ఆలయ అర్చకుడు కొండపి వెంకటదత్త శర్మ కల్యాణ క్రతువులు జరిపించారు. కొండపి శ్రీనివాసరావు, వసుంధర దంపతులు, అందే బాల చంద్రమౌళి, రాజేశ్వరి దంపతులు, వంగర కోటేశ్వరమ్మ, సుజాత, ఇంకా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పద్మావతి అమ్మవారి కల్యాణాన్ని తిలకించారు.

1న హనుమాన్ శోభాయాత్ర



తెనాలి: హనుమజ్జయంతి సందర్భంగా జూన్ 1న తెనాలిలో హనుమ శోభా యాత్ర బైక్ ర్యాలీని ఘనంగా చేపట్టనున్నారు. సంబంధిత స్టిక్కర్లు, వాల్ పోస్టర్లను తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మంగళవారం ఆవిష్కరించారు. శోభా యాత్ర కమిటీ సభ్యులు స్థానిక అయితానగర్‌లోని నివాసంలో శివకుమార్‌ను కలిశారు. సుల్తానాబాద్‌లోని హనుమాన్ ఆలయం నుంచి యాత్ర ఆరంభించి, దేవి చౌక్‌లోని చిట్టి ఆంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగుతుందని తెలిపారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కమిటీ సభ్యులు, హనుమాన్ భక్తులు వేమా సురేష్‌బాబు, కొల్లా గురునాథ్ గుప్త, మద్దాళి శేషాచలం, భాస్కరుని శ్రీనివాసరావు, కనమర్లపూడి సుబ్రహ్మణ్యం, ఆవుల కోటయ్య, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, పూర్ణచంద్రరావు, ఫణి, హనుమారెడ్డి, రమణ, అశోక్‌యాదవ్, సత్యం, ఆదిత్య, శ్రీను, బ్రహ్మం, కిరణ్, వాసు, కృష్ణ పాల్గొన్నారు.